దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: టిప్ టెక్ విహాన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచింగ్ శిక్షణ కోర్సుల్లో (రెగ్యులర్, కరస్పాండెంట్) చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ కొంగర శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. చైల్డ్ సైకాలజీ, టీచింగ్ మెథడ్స్, చైల్డ్ హెల్త్‌కేర్, స్కూల్-అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులు, ప్రాక్టికల్స్ అంశాల్లో తరగతులు ఉంటాయన్నారు. ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం. 90300 31419లో సంప్రదించాలని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా తన వంతు చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. ఆదివారం గోల్నాకలోని ఆయన క్యాంపు కార్యాలయంలో 23 మంది లబ్ధిదారులకు రూ.7.54 లక్షలు మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పీవీ నిరంజన్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ (సుందరయ్య పార్కు) 2025 అధ్యక్షుడిగా పీవీ నిరంజన్‌రెడ్డి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పార్కులో జరిగిన సర్వసభ్య సమావేశంలో క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పాస్ట్ ఇంటర్‌నేషన్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... గత కమిటీలో వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశానన్నారు. అందరి సహకారంతో క్లబ్ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని టీయూసీఐ తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటర్స్ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా కె. సూర్యం మాట్లాడుతూ.. కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలలో భాగంగా ఆటో మెయింటనెన్స్ కోసం రూ.12 వేలు ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. ఆటో మీటర్ల చార్జీలను పెంచి కొత్త ఆటో పర్మిట్‌లు జారీ చేయాలన్నారు. ఓలా, ఊబర్ సంస్థలను నిషేధించి ప్రభుత్వమే ఉచిత యాప్‌లు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగ్‌జన్ డెఫ్ ఎంప్లాయి అసోసియేషన్ నూతన కమిటీ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దివ్యాంగ్‌జన్ డెఫ్ ఎంప్లాయి అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. శివానందం, ప్రధాన కార్యదర్శిగా ఎస్ శివప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా బి. కృష్ణంచారి, వి. శ్రీనివాస్,మహిళా అధ్యక్షురాలిగా జి. సాయి మౌనిక, ఉపాధ్యక్షులుగా డి. చంద్రప్రకాష్, శ్రీనివాస్‌లు, శ్రీధర్, ఇందిరా, కోశాధికారిగా బి. శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా లింగయ్య, నాగేశ్వర్, రామేశ్వర్‌రాజులతో పాటు మరో 8మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చి సామాజిక, రాజకీయ, విద్యా రంగాలలో సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ సంక్షేమ సంమితి తెలంగాణ అధ్యక్షుడు అల్లదుర్గం సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లు అన్ని రంగాలలో అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజ్‌లను బీసీ-ఏ లోకి మార్చుతామని అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. న్యాయవాది చిల్లా రమేష్, సమితి ప్రధాన కార్యదర్శి బి.నర్సింహులు మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతూ ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని కోరారు. ముదిరాజ్ ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు.

శారదామాత జన్మతిథి వేడుకలు



కవాడిగూడ: రామకృష్ణ పరమహంస ధర్మపత్ని శారదామాతకు భక్తులపై మాతృ వాత్సల్యం అపారమైందని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మఠానికి వచ్చే భక్తులకు అలసట, విరామం లేకుండా ఆప్యాయంగా భోజనం పెట్టే చల్లని తల్లి శారదామాత అని ఆయన గుర్తుచేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో దివ్య జనని శారదాదేవి 172వ జయంతి ఉత్సవాలు కనులపండువగా సాగాయి. ఉదయం సుప్రభాతం, మంగళవారతి, భజనలతో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం దేవాలయ ప్రదక్షిణ, లలిత సహస్రనామ పారాయణం, హోమం నిర్వహించారు.

ఎన్టీఆర్ స్టేడియం..
సాహితీ అభిమానం.!

పుస్తక ప్రియులతో కళకళలాడిన హైదరాబాద్ బుక్ ఫెయిర్



సాహిత్య వేదిక పుస్తక స్ఫూర్తిలో పాల్గొన్న కవి విమర్శకులు జి.లక్ష్మినర్సయ్య, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, అశ్వినీకుమార్, ఆరతీ



డాక్టర్ రవ్వ హరికుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్



బొడుసు తెలంగాణ కథ-2023 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాలువ మల్లయ్య తదితరులు

కవాడిగూడ: ఆదివారం సెలవుదినం కావడంతో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ సాహితీ అభిమానులతో పోటెత్తింది. మరోవైపు తోపుడు బండి సాదిఖ్ వేదికపై వరుసగా పుస్తకావిష్కరణలు జరిగాయి. అంబేడ్కరిజం అంటే ఏమిటి.? తిరుపతి బాలాజీ బౌద్ధక్షేత్రమే, డాక్టర్ అంబేడ్కర్ అనగారిన కులాల భవిష్యత్, బొడుసు, తెలంగాణ కథ-2023 తదితర పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవి విమర్శకులు కాలువ మల్లయ్య మాట్లాడుతూ... తెలంగాణ కథ.. బహుజనుల కథ తెలంగాణ యువతం కూడా అద్భుతమైన కథలు రాస్తున్నారని అన్నారు. తెలంగాణ కథని, భాషని బతికించాలని కోరారు. గుడిపల్లి నిరంజన్ మాట్లాడుతూ... కథల్లో తెలంగాణ సామాజిక ఇతివృత్తం దాగి ఉందన్నారు. పోడూరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఈ సంకలనాల ద్వారా తెలంగాణలో కొత్త కథకులు బయటకు వస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ బహుజనుల నేల అని, యువ రచయితలు నిరూపిస్తున్నారని అన్నారు.

బుక్‌ఫెయిర్ వేదికగా "సాహిత్య వేదిక పుస్తక స్ఫూర్తి"

హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా "సాహిత్య వేదిక పుస్తక స్ఫూర్తి"కార్యక్రమాన్ని ప్రముఖ కవి విమర్శకులు జి.లక్ష్మినర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు ప్రభావితం చేసిన పుస్తకాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆరతీ హెచ్ఎస్ మాట్లాడుతూ.. ఇంత వరకు చదివిన పుస్తకాలలో ఏది ప్రభావితం చేసిందని చెప్పడం కష్టమన్నారు. తన తల్లిదండ్రుల ఇద్దరికి సాహిత్యంతో పరిచయం ఉండటంతో పుస్తకాల ప్రపంచంలో పెరిగానని పేర్కొన్నారు. రష్యన్ అనువాదాలు మొదటి సారిగా చాలా ప్రభావితం చేసినట్లు వెల్లడించారు.

◆ అశ్వినీకుమార్ మాట్లాడుతూ... పుస్తకాలు మనల్ని సంపూర్ణంగా మార్చేస్తాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన కుల నిర్మూలన, గాంధీ రాసిన మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రుత్, మంటో కథలు, విక్రమ్ సేథ్ పుస్తకాలు తనను ప్రభావితం చేశాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ ఈ సందర్భంగా అశ్వినీకుమార్, ఆరతీ హెచ్ఎస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకుబ్, ప్రధాన కార్యదర్శి వాసు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం విజయానికి సోపానం

పుస్తక పఠనం విజయానికి సోపానమని మానసిక వైద్యనిపుణులు డాక్టర్ రవ్వ హరికుమార్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ స్టాల్ నం.245లో ఆదివారం డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ ఆధ్వర్యంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవ్వా హరికుమార్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుస్తక పఠనం మానవ జీవితాన్ని పరిపుష్టం చేసేందుకు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పఠనం ఆలోచనలను విస్తరించడమే కాకుండా విజ్ఞానం, అభివృద్ధికి మార్గం చూపించే సాధనంగా నిలుస్తుందని తెలిపారు.

◆ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ... పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. యువతలో పుస్తక పఠనం పెంపొందించి వారిని ఆలోచనపరులుగా మార్చడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు అడిగిన ప్రశ్నలకు సలహాలు సూచనలు ఇచ్చిన డాక్టర్ రవ్వా హరికుమార్‌ను సైకాలజిస్టులు విజయలక్ష్మి, నిరోషా, రమేష్, జ్యోతి, పి.స్వరూపారాణి, సరోజిని రామారావు, వేణుగోపాల్, నరేష్‌ను సన్మానించారు.

ఫస్ట్ టైమ్ వచ్చాను



నేను బీకాం స్టూడెంట్‌ను. ఇక్కడ పుస్తకాల కలెక్షన్ బాగుంది. నాకు బుక్ రీడింగ్ అలవాటు ఉంది. కానీ ఎక్కువగా ఆన్‌లైన్ బుక్స్ చదివేదాన్ని. బుక్‌ఫెయిర్ గురించి మా ఫ్రెండ్స్ చెప్పడంతో నేను ఇక్కడికి ఫస్ట్‌టైమ్ వచ్చాను. వన్ ఇండియన్ గర్ల్, స్టోరీస్ వి నెవర్ టెల్ పుస్తకాలు కొన్నాను.

– కౌముది

సనాతన ధర్మ పరిరక్షణకు డా.శిరీష సేవలు భేష్



బహుమతులు అందుకున్న చిన్నారులతో రామకృష్ణ చంద్రమౌళి, శివలంక భవాని

నల్లకుంట: ఇండియన్ స్కూల్ ఆఫ్ వేదిక్ స్టడీస్, గీతా ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో 'సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి సంప్రదాయం పరిరక్షణ'అనే అంశంపై వైదిక సభ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడారు. విదేశాలలో ఉన్న భారతీయ బాలబాలికలకు వేదాలు, పురాణాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అంతర్జాల వేదికగా డాక్టర్ శిరీష జయంత్ తరగతులు నిర్వహిస్తూ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. విశిష్ట అతిథిగా హాజరైన మాడపాటి హనుమంతారావు బాలికల పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్ శివలంక భవాని ముఖ్యఅతిథి రామకృష్ణ చంద్రమౌళితో కలిసి ఈ వేదికలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు విద్యార్థులు తాము నేర్చుకున్న శ్లోకాలు, పద్యాలు, కీర్తనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. అతి స్వల్ప కాలంలోనే భగవద్గీత శ్లోకాలు నేర్చుకుని ఈ వేదికలో పఠించిన చిన్నారి ఎస్. సాన్వికఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గీతా ఫౌండేషన్ అధ్యక్షుడు పి.బడేసాబ్, గిరిజా రాణి, సంగీత, జయంత్, విమల తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీల 10శాతం రిజర్వేషన్‌ను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి



సేవాలాల్ బంజారా సంఘం వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న మోతీలాల్ నాయక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సేవాలాల్ బంజార సంఘం 10వ వార్షికోత్సవ సభ ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సేవాలాల్ బంజార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్రా మోతీలాల్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు కె. గాంధీనాయక్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఎస్టీల 10శాతం రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. బంజార్ బాషా, గోర్ లిపీని 8వ షెడ్యూల్‌లో చేర్చి అధికార భాషగా గుర్తించాలని సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం రూ.10కోట్లు నిధులు కేటాయించాలన్నారు. గోర్ బంజారా మహానీయుల జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, 5, 6వ షెడ్యూల్‌లో గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, గిరిజన తండాలను ప్రత్యేక రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షుడు సక్రిబాయ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చందునాయక్, రాజేష్ నాయక్, గణేష్, నాగు, ప్రసాద్, రవినాయక్, దేవానాయక్, డాక్టర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



ఓంకార్ భవన్‌లో జరిగిన ఉద్యమకారుల సదస్సులో సుల్తాన్ యాదగిరి, ప్రఫూల్ రాంరెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి టి.ప్రఫూల్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో తెలంగాణ ఉద్యమ కళాకారుల హక్కుల సాధనకై ఆటాపాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన కళాకారులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లలో 10శాతం ఇళ్లను కేటాయించాలని కోరారు. అంతేకాకుండా తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ కోశాధికారి కె. చంద్రశేఖర్ ప్రసాద్, జి.చంద్రుడు, షేక్ షవాలీ, మోహన్‌బైరాగీ, జె.ఇందిరా, రేణుఖ, చంద్రకళ, హనుమంతు, గంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు మున్నూరుకాపులు సిద్ధం కావాలి



కాచిగూడ: తెలంగాణలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మున్నూరుకాపులు సిద్ధం కావాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలోని సంఘం కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్ పటేల్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్మోహన్ పటేల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో మున్నూరుకాపు సంఘం కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర సంఘంకు అనుబంధంగా గ్రామ స్థాయి నుంచి యూత్, మహిళ, రైతు, కార్మిక, సీనియర్ సిటిజన్స్, లీగల్ సెల్ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి కమిటీలో 15మంది సభ్యులు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కల్గిన మున్నూరుకాపులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని కోరారు. మున్నూరుకాపులను విస్మరించే పార్టీలకు గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

వ్యవసాయ స్థిరీకరణ కావాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ కావాలని ప్రొఫెసర్ దండా రాజిరెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పట్టు రైతుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వ్యవసాయంలో ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమల లాంటి సెక్టార్లు కలిసి పనిచేసినప్పుడే వ్యవసాయానికి గిట్టుబాటు అవుతుందన్నారు. నేలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మూడ్ శోభన్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభిమన్యూరెడ్డి, ప్రసాద్, బాలకృష్ణ, రవీందర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ నూతన కమిటీ ఎన్నిక

కాచిగూడ: హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ అధ్యక్షతన జరిగిన ట్రస్ట్ ప్రతినిధుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం కాచిగూడ, హరాస్‌పెంటలోని ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రాజేందర్ పటేల్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ విగ్, ఉపాధ్యక్షులుగా సి.నందకిషోర్ యాదవ్, అనంతుల అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా పగిడి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా రతన్ విద్యాసాగర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.మహేందర్, బీమగోని కృష్ణాగౌడ్, కోశాధికారిగా కె.సాయిగిరిధర్ ఎన్నికయ్యారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

చిక్కడపల్లి: వెంపటి కూచిపూడి డాన్స్ అకాడమీ, గీత ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అన్నమయ్య కీర్తన అలివేలు మంగకి మైలవరపు శిరీష నృత్యం అలరించింది. అనంతరం మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ కిషోర్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అభినందించి సన్మానించారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీలో బ్లాక్ బెల్ట్‌ల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం కాచిగూడలో జరిగింది. కరాటే బెల్ట్ గ్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హైదరాబాద్ యూనివర్సిటీ చాన్సలర్ ఎల్‌నరసింహారెడ్డి బ్లాక్ బెల్ట్‌లను ప్రదానం చేశారు. అందరూ ఆరోగ్యం, ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఇది ఆర్ఎస్ఎస్, బీజేపీ డీఎన్ఏలో భాగమేనని ప్రముఖ సీనియర్ అంబేడ్కర్ వాది జేబిరాజు విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేబీ రాజు మాట్లాడుతూ... అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. రాజ్యసభలో అంబేడ్కర్ పేరును ఉచ్చరిస్తూ అహంకార పూరితంగా మాట్లాడటం అవమానకరమని అన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోతను నిరోధించాలి



కాచిగూడలో బజరంగ్ సేన నిరసన ర్యాలీ

కాచిగూడ: బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోతను అంతర్జాతీయ సమాజం నిరోధించాలని బజరంగ్ సేన తెంగాణ అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బజరంగ్ సేన ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాచిగూడ రైల్వేస్టేషన్, శ్యామ్ మందిర్ నుంచి కాచిగూడ చౌరస్తా వీరసావర్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకుని ఐక్యరాజ్య సమితి ద్వారా బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేందర్, యోగి ప్రశాంత్ దాస్‌జీ, సంజయ్‌కుమార్, శ్రీనివాస్ గుప్తా, రఘువకుమార్, భవాని, కిరణ్, ప్రియ, దీక్షిత, వినయ్ తివారి, మనోజ్, తరుణ్‌జీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి



చిక్కడపల్లి: డివిజన్‌లో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని సంబంధింత శాఖ అధికారులను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్ కుమార్ కోరారు. ఆదివారం సాయంత్రం డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో వీధి దీపాలు సరిగా వెలగక రాత్రి సమయాల్లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేగాకుండా గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్, వివేక్‌నగర్, గానసభ, అశోక్‌నగర్ గ్రంథాలయం, కాపువాడ, జనత పార్కు, సుధాహోటల్ లేన్, జవహర్‌నగర్, లేబర్ కార్యాలయం, చిక్కడపల్లి పోలీసు స్టేషన్, అశోక్‌నగర్ చౌరస్తా, గాంధీనగర్, పీఅండ్‌టీ కాలనీ, వివేక్‌నగర్ బస్తీ, సబర్మతినగర్, అరుంధతినగర్, ఎల్లయ్యబస్తీ, నేతాజీనగర్, బాపూనగర్, సంజీవయ్య నగర్ తదితర ప్రాంతాలలో వీధిలైట్లు రాని మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. ఈ విషయమై పలుమార్లు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ సంబంధింత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు మరమ్మతులు చేపట్టం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: పార్టీని బూత్‌స్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలోని పోలింగ్‌బూత్ నం.214లో సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా 214 పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన అనిల్ ఆరోరాకు కిషన్‌రెడ్డి నియామకపు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారాణి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, పార్టీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, జి.కావ్యా కిషన్‌రెడ్డి, కృష్ణకుమార్, శీర్‌సాగర్, సుభాష్ పటేల్ పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యం..

చిక్కడపల్లి: బూత్ స్థాయి నుంచి బీజేపీ పటిష్టం చేసేందుకు పార్టీ శ్రేణులు అంకితభావంతో కృషి చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి డివిజన్‌లోని 20 నెం.బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షుడు హన్మంతుతో పాటు సభ్యులను సన్మానించారు.

భగవద్గీతలోనే సమస్త జ్ఞానం

● అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ జీఎం శంభువైష్ణవ్ దాస్ ● మహానగర సంకీర్తన పల్లకీ సేవా ఊరేగింపు ● భారీగా హాజరైన భక్తులు







పల్లకీ సేవలో ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు

చిక్కడపల్లి: భగవంతుని నామస్మరణతోనే మనిషిలోని అజ్ఞానం తొలగిపోయి విజ్ఞానవంతుడు అవుతాడని అబిడ్స్ ఇస్కాన్ టెంపుల్ జనరల్ మేనేజర్ శంభువైష్ణవ్‌దాస్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ధ్యాన గణపతి మందిర్ ఆవరణలో ఇస్కాన్ ప్రతినిధి నవదీప్ గౌరవ్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో మహానగర సంకీర్తన పల్లకీ సేవా ఊరేగింపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంభువైష్ణవ్ దాస్ మాట్లాడుతూ.. భక్తి భావంతోనే పరమానందం సాధ్యమన్నారు. డబ్బుతో భౌతిక ఆనందం తప్ప మానసిక ఆనందం లభించదన్నారు. ప్రపంచంలో సమస్త జ్ఞానం భగవద్గీతలోనే ఇమిడి ఉందన్నారు. కులమతాలకు అతీతంగా పేద ధనిక తేడా లేకుండా అన్ని వర్గాల వారు ఇస్కాన్ సేవా కార్యక్రమంలో పాల్గొనవచ్చునన్నారు. "హరేకృష్ణ హరేకృష్ణ.. కృష్ణకృష్ణ హరేహరే.. హరేరామ హరే రామ.. రామరామ హరేహరే"అనే నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. భక్తులు తన్మయత్వంలో కీర్తనలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ధ్యానగణపతి మందిర్ చైర్మన్ సత్యనారాయణ, ఇస్కాన్ భక్తులు మురికి గణేష్, నండూరి శ్రీనివాస్‌రావు, రజనికాంత్, అఖిలేష్, రామకృష్ణ, శేఖర్, వినోద్, సింధు, చిత్ర, అర్జున, లలిత, వనజ, శ్రావణి తదితర భక్తులు పాల్గొన్నారు.